సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు పలికాయి. మార్కెట్‌కు 15 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.60

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.33, సరాసరిన రూ.50 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.5°/21.8°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పేద ఖైదీల సంక్షేమానికి జిల్లా స్థాయి కమిటీ



అధికారులతో సమావేశమైన కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ జైళ్లలో ఉన్న పేద ఖైదీల సంక్షేమానికి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పేద ఖైదీలకు సాధికార కమిటీ ఏర్పాటుపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పేద ఖైదీలకు సంక్షేమం కోసం ఒక పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా కోర్టు విధించిన జరిమానా చెల్లించలేక, ఆర్థిక ఇబ్బందుల కారణంగా బెయిల్ పొందలేని ఖైదీలకు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలో కలెక్టర్/జిల్లా మేజిస్ట్రేట్ కార్యదర్శిగా ఉంటారని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జైలు సూపరింటెండెంట్, జిల్లా జడ్జి నామినీగా ఉంటారన్నారు. మిగతా కమిటీ సభ్యులతో జిల్లా కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఎట్టకేలకు 'సమగ్ర' ఉద్యోగులకు జీతాలు

- రెండు నెలల జీతాల బడ్జెట్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాకు రూ. 13.14 కోట్లు



అనంతపురం ఎడ్యుకేషన్: ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. జీతాల బడ్జెట్ విడుదల చేసి సమగ్ర శిక్ష ఉద్యోగులకు పండగ పూట పస్తులు లేకుండా చేసింది. రెండు నెలలు పూర్తయినా ఆగస్టు, సెప్టెంబర్ జీతాలు అందక 'సమగ్ర శిక్ష'లో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందారు. దసరా సమీపిస్తుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష ఉద్యోగుల జీతాల ఎదురుచూపులపై మూడు రోజుల క్రితం 'సాక్షి'లో 'పండగ పూటా పస్తులేనా' శీర్షికతో ప్రత్యేక కథనం వెలువడింది. అలాగే సోమవారం ప్రధాన సంచికలో 'సారూ.. జీతాలెప్పుడు?' శీర్షికతో మరో కథనం వచ్చింది. దీంతో స్పందించిన ప్రభుత్వం ఆగమేఘాలపై సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులకు సంబంధించి రూ. 13.14 కోట్లను విడుదల య్యాయి. అలాగే ఆగస్టు, సెప్టెంబరు నెలల కేజీబీవీ డైట్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని కేజీబీవీలకు రూ. 2.56 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలోని కేజీబీవీలకు రూ. 2.13 కోట్లు విడుదలయ్యాయి.

నేడు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ

ఉమ్మడి జిల్లాలో సమగ్రశిక్ష పరిధిలో 2,800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆయా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం జీతాలు జమ కానున్నాయి. సోమవారం మధ్యాహ్నం బడ్జెట్ విడుదల చేయగానే జీతాల బిల్లులను సిద్ధం చేశారు. సాయంత్రం బ్యాంకు సమయం ముగియడంతో మంగళవారం ఉదయాన్నే బ్యాంకుకు పంపుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలియజేశారు.

'ఎన్‌ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు

పుట్టపర్తి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు పొడిగించారు. ఈ ఏడాది డిసెంబరు 8న ఈ పరీక్ష జరగనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సదుపాయం లేని మోడల్ స్కూళ్లలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏటా రూ. 12 వేలు చొప్పున మొత్తం రూ. 48 వేలు ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదొక మంచి అవకాశం అని పేర్కొన్నారు. వీలైనంత ఎక్కువమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

ట్రావెల్స్‌లో జీరో దందా!

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును గత నెలలో జిల్లా రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఆ బస్సులో ప్రయాణికుల కంటే సరుకులే ఎక్కువగా కనిపించాయి. దీంతో అదే రూట్లో తిరిగే ఇతర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నిలిపి తనిఖీ చేయగా... దాదాపు ప్రతి బస్సులోనూ సరుకులు భారీగా కనిపించాయి. అన్నీ పెద్దపెద్ద బాక్సుల్లో నింపి ఉండగా..రవాణాశాఖ అధికారులు మూడు బస్సులపై కేసులు నమోదు చేశారు. వాస్తవానికి ఆయా బస్సుల్లో రవాణా అవుతున్న సరుకు విలువ రూ.కోట్లలోనే ఉంటోందని, వాటికి బిల్లులు కూడా ఉండవని సమాచారం. ఇలా జిల్లా మీదుగా రోజూ వందల సంఖ్యలో తిరిగే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో జీరో సరుకు దందా యథేచ్ఛగా సాగిపోతోంది.

- ప్రయాణికుల పేరుతో సరుకు రవాణా
- మూడు రాష్ట్రాల మధ్య యథేచ్ఛగా తరలింపు
- ట్రావెల్స్ బస్సుల పర్మిట్ల తనిఖీకే పరిమితమవుతున్న అధికారులు
- నిత్యం బెంగళూరు–హైదరాబాద్ మధ్య భారీగా సరుకు రవాణా



ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు సరుకు లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

హిందూపురం అర్బన్: ఎలక్ట్రానిక్స్ పరికరాలకు బెంగళూరు ప్రసిద్ధి. హైదరాబాద్‌లో వస్త్ర వ్యాపారం ఎక్కువ. అందుకే ఈ రెండు నగరాల మధ్య సరుకు రవాణా ఎక్కువగా సాగుతుంటుంది. ఎవరైనా వ్యాపారి సరుకు కొనుగోలు చేస్తే వాటిని రవాణా చేసేందుకు జీఎస్టీ బిల్లు చూపించాల్సి ఉంటుంది. అందుకే వ్యాపారులు పన్ను ఎగ్గొట్టేందుకు ప్రైవేటు ట్రావెల్స్ బాట పట్టారు. రూ.లక్షల విలువైన సరుకును రూ.వేలల్లో చూపుతూ ప్రైవేట్ ట్రావెల్స్‌లో లగేజీ రూపంలో తరలిస్తున్నారు. ఇందుకు ట్రావెల్స్ యాజమాన్యాలకు భారీగా ముట్టజెపుతున్నారు. అందువల్లే బెంగళూరు – హైదరాబాద్ మధ్య ప్రయాణికుల కంటే సరుకు రవాణా నుంచే ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులకు అధిక ఆదాయం సమకూరుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని ట్రావెల్స్ కంపెనీలు ప్రయాణికుల ముసుగులో సరుకు రవాణాకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది.

అనుమానం రాకుండా ప్యాకింగ్ చేసి..

హైదరాబాద్–బెంగళూరు, బెంగళూరు–హైదరాబాద్ మధ్య నిత్యం జాతీయ రహదారిపై సుమారు 500 బస్సులు తిరుగుతుంటాయి. ఇక శని, ఆదివారాలు, సెలవుదినాల్లో 800 బస్సుల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో 20 శాతం బస్సుల్లో ప్రయాణికుల కంటే టాప్‌లపై, బస్సు కింద భాగంలో విలువైన సరుకే ఎక్కువగా తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్యాకింగ్ చేసిన పెద్ద పెద్ద బండిళ్లు, గార్మెంట్స్ దుస్తులు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులు, మద్యం గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే రవాణా చేస్తున్నారు. ఇలా బెంగళూరు నుంచి ఏపీ, తెలంగాణకు, హైదరాబాద్ నుంచి ఏపీ, కర్ణాటకకు భారీగా జీరో సరుకు తరలిపోతోంది.

తనిఖీ చేయరన్న ధీమా..

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసే రవాణా అధికారులు ఏ బస్సులో ఎంత మంది ప్రయాణికులు ఉన్నారు? వాహన రికార్డులు తదితర వాటిని చూస్తారు గానీ, లగేజీ ఏముంది అన్నది తనిఖీ చేయడం లేదు. లగేజీ నిబంధనలకు మించి ఉన్నట్లయితే కేసులు నమోదు చేసి జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న కొంతమంది ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు తమ ట్రావెల్స్‌లో ఎలాంటి అనుమానం ఉండదని కర్ణాటక నుంచి విలువైన సరుకులు, మద్యం రవాణా చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు గుట్టు చప్పుడు కాకుండా మత్తు పదార్థాలు, ఎలక్ట్రానిక్, బోర్‌వెల్స్‌కు వాడే పరికరాలు, విలువైన సెల్‌ఫోన్లు, ఇలా ప్రతి సరుకు ఎలాంటి బిల్లులు లేకుండానే చేరుతోంది.

సరుకు రవాణా ద్వారా భారీగా ఆర్జన

బెంగళూరు – హైదరాబాద్ రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణం చేసే వారు విలువైన సరుకు, బంగారం, వెండి, నగదు తరలింపునకు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఎంచుకుంటున్నారు. హైదరాబాద్‌లో రాత్రి 10, 11 గంటల మధ్య బస్సులు బెంగళూరుకు బయలుదేరుతాయి. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులు బయలుదేరతాయి. ఆయా బస్సుల్లో సగానికి పైగా జీరో బిజినెస్‌కు సంబంధించిన సరుకే రవాణా అవుతోంది. కొన్ని బస్సుల్లో ప్రయాణికులే విలువైన సరకును రాష్ట్రాలు దాటించేందుకు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సరుకు రవాణా ద్వారా ఒక్కోబస్సు ద్వారా నిర్వాహకులు నెలకు రూ. 2 లక్షల దాకా వెనకేసుకుంటున్నారు. ఈ లెక్కన నెలకు సగటున రూ.10 కోట్ల వరకూ జీరో వ్యాపారం సాగుతున్నట్లు అంచనా.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



బస్సుల్లో ప్రయాణికులను మాత్రమే తరలించాలి. లగేజీ ఉన్న ప్రయాణికులకు సంబంధించి పరిమితంగానే ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సరుకు రవాణా చేయకూడదు. నిబంధనలు అతిక్రమించి సరుకు రవాణా చేస్తే చర్యలు తప్పవు.

– కరుణసాగర్‌రెడ్డి, డీటీసీ, హిందూపురం



గతనెలలో కొడికొండ చెక్‌పోస్టులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

చనిపోవాలనుకుని పాపను వద్దనుకుంది

- కదిరి బస్టాండులో పసిపాపను వదిలి వెళ్లిన తల్లి ఆచూకీ లభ్యం
- గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతిగా గుర్తింపు
- బాలికను శిశు విహార్‌కు తరలింపు



పాపను శిశు విహార్‌కు తరలిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: స్థానిక బస్టాండులో ఐదు నెలల శిశువు (బాలిక)ను వదిలి వెళ్లిన మహిళ ఆచూకీ దొరికింది. వివాహమై ఇద్దరు పిల్లలు కలిగాక భర్త మృతి చెందడం, ఆ తర్వాత మరొకరితో వివాహం కాగా, అతని వేధింపులు ఎక్కువై ఆత్మహత్య చేసుకోవాలనుకున్న సదరు మహిళ రెండో భర్త ద్వారా కలిగిన శిశువును కదిరి బస్టాండులో వదిలి వెళ్లింది. ఈఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను కదిరి సీఐ నారాయణరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు.

రెండో భర్త వేధించడంతో...

అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతికి వివాహమై ఇద్దరు పిల్లలు సంతానం. అనంతరం భర్త మృతి చెందడంతో సంతానాన్ని అత్తమామలే చూసుకుంటున్నారు. దీంతో జ్యోతి ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లింది. అక్కడ కర్ణాటక రాష్ట్రం దొడ్డ బల్లాపూర్ దగ్గర గల బేతం గ్రామానికి చెందిన కుమార్‌తో వివాహం చేసుకుంది. ఐదునెలల క్రితమే జ్యోతి చిన్నారికి జన్మనిచ్చింది. అయితే రెండో భర్త కుమార్ వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఆదివారం అక్కడి నుంచి బయలుదేరి కదిరికి చేరుకుంది. ఏదో ఒక పనిచేసుకుని బతకాలని తొలుత భావించింది. ఆ తర్వాత మనస్సు మార్చుకుని ఆత్మహత్య చేసుకోవాలకుంది. ఈక్రమంలో పసిపాపను బస్టాండ్‌లో ఉన్న ఓ ప్రయాణికురాలికిచ్చి... వెళ్లిపోయింది. అయితే ఆత్మహత్య చేసుకునే ధైర్యం సరిపోక ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. సోమవారం కదిరి సమీపంలో సంచరిస్తున్న జ్యోతిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్పటికే ఆమెకోసం వెతుకుతున్న పోలీసులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు ఆరా తీశారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత పాపను వారికి అప్పగిస్తామని, అంతవరకూ శిశువును పుట్టపర్తిలోని శిశువిహార్‌కు పంపినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 171 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 171 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్కరోజు అనగా శుక్రవారం హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులు తనిఖీలు చేయాలన్నారు. దీంతో సమస్యలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఇలా అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రతి శాఖ అధికారి క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు మాతృ శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించుకోవాలన్నారు.

ఎప్పటికప్పుడు కౌంటర్ ఇవ్వాలి..

వివిధ దిన పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు ఆయా శాఖల ఉన్నతాధికారులు ఖండన ప్రచురించాలని కలెక్టర్ సూచించారు. కోర్టు కేసులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో కౌంటర్ ఫైల్స్, అప్పీలు దాఖలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దీన్ని గుర్తించి అధికారులంతా పనిచేయాలన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా..

- సోమందేపల్లి మండలం వెల్లిదడకల గ్రామం సర్వే నంబర్ 314లోని తమ భూమిని అధికారులు జాతీయ రహదారి విస్తరణ కోసం సేకరించారని, వెంటనే పరిహారం అందేలా చూడాలని నరసింహప్ప కలెక్టర్‌కు విన్నవించారు.
- బత్తలపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్లు 275–5లో ఉన్న 2.75 ఎకరాల భూమిలో యజమానులు ప్లాట్లు వేశారని, కానీ ఇందుకు గంటాపురం జగ్గు అనే వ్యక్తి అభ్యంతరం తెలుపుతున్నారని ఎం.శివశంకర్ కలెక్టర్‌కు తెలిపారు. సరిహద్దు సమస్య చాలా రోజులుగా సాగుతోందని, వెంటనే సదరు భూమిని సర్వే చేయించాలని కోరారు.
- హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో జోరుగా కల్తీకల్లు తయారవుతోందని పలువురు స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కల్తీకల్లు ఆయా మండల కేంద్రాల్లో సుమారు 40 వాహనాల ద్వారా సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని, వెంటనే కల్తీకల్లును అరికట్టాలని వినతి పత్రం అందజేశారు.

శ్రీకృష్ణావతార.. ఖాద్రీశా



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కదిరి లక్ష్మీనరసింహస్వామి శ్రీకృష్ణావతార అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ముగ్ధమనోహర రూపంలో ఉన్న వసంతవల్లభున్ని దర్శించుకున్నారు. – కదిరి టౌన్:

ఇసుక అక్రమ రవాణా సహించం

- కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరిక
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్న ఎస్పీ



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, చిత్రంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: 'ఉచిత ఇసుక' విధానం జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడం, నిబంధనలకు విరుద్ధంగా తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆయన ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉచిత ఇసుక విధానం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ఇసుక సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడిందన్నారు. ఈనెల 15 నుంచి తిరిగి రీచ్‌లలో అవసరమైన మేరకు ఇసుక అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఎక్కడైనా రైతులు భూముల్లో ఇసుక లభ్యత ఉంటే.. నిబంధనల మేరకు వారు అమ్ముకోవడానికి అనుమతులు ఇస్తామన్నారు. జీఓ నంబర్ 52 మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ఒకే ధర ఉంటుందని, జిల్లాలోనూ ఇదే అమలు చేయాలని ఆదేశించారు. సీసీరేవు, పీసీరేవుల్లో 1,15,000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇక్కడి నుంచి అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు కూడా సరఫరా చేస్తామన్నారు. ఈ రెండు యార్డుల ద్వారా రోజూ 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇసుక ధర ఉచితం కాగా, నిర్వహణ కోసం టన్నుకు రూ.399 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలను ప్రాధాన్యతగా తీసుకుని ఇసుక సరఫరా చేస్తామన్నారు.

సమాచారం ఇస్తే చర్యలు..

ఇసుక అక్రమ రవాణా, నిల్వపై ప్రజలు సమాచారం ఇస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.రత్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా, బ్లాక్ మార్కెటింగ్‌పై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తామన్నారు. అలాగే జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇక నుంచి ఇసుక డెలివరీ అడ్రస్‌పై మానిటరింగ్ చేస్తామన్నారు. సమావేశంలో మైనింగ్ శాఖ అధికారి షేక్ అమీర్ బాషా, ధర్మవరం ఆర్డీఓ మహేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వందరోజుల్లో హామీలు బొందపెట్టారు

- 'ఇది మంచి ప్రభుత్వం' చేపట్టడం హాస్యాస్పదం
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది
- చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం



రొళ్ల: హెచ్‌ఎంపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, చిత్రంలో మాజీ మంత్రి నర్సేగౌడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

పరిగి/రొళ్ల: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు చేసిందేమీ లేదని, వారు చేసిందల్లా హామీలు బొంద పెట్టడమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. సోమవారం ఆమె రొళ్ల మండలం హెచ్‌ఎంపల్లిలో, అనంతరం పరిగిలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తన వంద రోజుల పాలనలో చేసిందేమీ లేదన్నారు. కనీసం తాను ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. పైగా ఇది మంచి ప్రభుత్వమంటూ ఇంటింటికీ స్టిక్కర్లు వేసేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకు 'తిరుమల లడ్డూ కల్తీ' అంటూ అసత్యాలు వల్లించారన్నారు. అయితే సుప్రీంకోర్టు చంద్రబాబుకు చెంపపెట్టులా తీర్పు ఇవ్వడంతో మిన్నకుండి పోయారన్నారు. రాజకీయాల్లోకి కలియుగ దైవాన్ని లాగి కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఇకనైనా ఆయన బుద్ధి తెచ్చుకుని ప్రజలకు మేలు జరిగేలా పరిపాలన సాగించాలని హితవు పలికారు.

హోం మంత్రి ఉన్నట్టా? లేనట్టా?

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై రోజురోజుకూ అత్యాచారాలు జరుగుతున్నా హోం మంత్రిగా ఉన్న అనిత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ దుయ్యబట్టారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో ఓ బాలికపై జరిగిన సంఘటనపై కనీసం చర్యలను చేపట్టలేని హోం మంత్రి అనిత, ఆమెకు ఆ శాఖను అప్పగించిన చంద్రబాబు సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి, దిశ చట్టాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన వైఎస్ జగనన్న ప్రభుత్వానికి మహిళలంతా ఎప్పటికీ అండగా ఉంటారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎప్పటికీ స్వార్థపూరిత రాజకీయాలతో మాత్రమే నిలుస్తారన్నారు. ఆయనకు ఏపీ ప్రజలపై చిత్తశుద్ధి లేదన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో ఆయన చేసిన హడావిడిని జనమే తప్పుపడుతున్నారన్నారు.

క్లుప్తంగా

టపాసుల స్వాధీనం

ధర్మవరం అర్బన్: స్థానిక తేరు బజార్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.64,800 విలువైన టపాసులను సోమవారం ఇన్‌చార్జ్ సీఐ రెడ్డప్ప స్వాధీనం చేసుకున్నారు. టపాసులు నిల్వ చేసిన ముంటిమడుగు రెడ్డి సాయిని అరెస్ట్ చేశారు.

హిందూపురంలో పలువురి అరెస్ట్

హిందూపురం అర్బన్: ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్న స్థానిక మసీదు ఏరియా, ధనలక్ష్మి రోడ్డులోని మహాలక్ష్మి జనరల్ స్టోర్, డైమండ్ పాపులర్ దుకాణాల నిర్వాహకులను సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసి రూ.63 వేల విలువైన బాణాసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహాలక్ష్మి జనరల్ స్టోర్ యజమాని లాలారాం, డైమండ్ ట్రేడర్స్ యజమాని సనారామ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ రాజగోపాల్ నాయుడు తెలిపారు.

హిటాచీ సీజ్



పోలీసుల అదుపులో ఉన్న హిటాచీ

బత్తలపల్లి: మండలంలోని సంగాల సమీపంలో చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమంగా లోడింగ్ చేసేందుకు సిద్ధంగా ఉంచిన హిటాచీని పోలీసులు సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకను గమనించిన డ్రైవర్లు తమ వాహనాలను అక్కడి నుంచి శరవేగంగా తరలించుకెళ్లారు. నదిలో ఉన్న హిటాచీని పోలీసులు సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు.

విగ్రహాల చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని తుమ్మలకొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ ఏడాది ఆగస్టు 27న విగ్రహాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో పుట్టపర్తి మండలం కొత్తనిడిమామిడికి చెందిన నగిరిగిరి గంగరాజు, ధర్మవరం మండలం యలక్కుంట గ్రామానికి చెందిన చెడిపోతుల నాగరాజును సోమవారం ఉదయం అమడగూరు మండలం వెంకటనారాయణపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ వెంకటనారాయణ అరెస్ట్ చేశారు. వీరి నుంచి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి పంచలోహ విగ్రహాలు, వెండిగొడుగు, వెండి ముఖ కవచాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వందల ఏళ్ల నాటి కల సాకారం

పెనుకొండ వాసుల వందల ఏళ్ల నాటి కల గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో సాకారమైంది. గతంలో పెనుకొండ – అనంతపురం మార్గంలో రైల్వే గేటు పడితే గంటల తరబడి ప్రయాణికులు నానా ఇబ్బంది పడేవారు. ఈ మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వందల ఏళ్లుగా స్థానికులు కోరుతూ వచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ విషయంపై పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కేంద్ర రైల్వే శాఖ ద్వారా బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు సాధించారు. రూ.40 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు రెండేళ్ల పాటు కొనసాగాయి. 'బో స్ట్రింగ్ ఆర్చ్ స్టీల్ గిర్డర్' మోడల్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ బ్రిడ్జి ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై సోమవారం ఉదయం నుంచి వాహన రాకపోకలు మొదలయ్యాయి.

– పెనుకొండ



ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళుతున్న వాహనాలు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

రొద్దం: మండలంలోని ఆర్.కుర్లపల్లి పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. రోజూ 10 నుంచి 20 ట్రాక్టర్ల ద్వారా తమ గ్రామ పెన్నానది నుంచి ఇసుకను భారీగా తరలిస్తున్నారని, దీంతో గ్రామస్తులంతా ఏకమై అక్రమ తరలింపులను అడ్డుకున్నామని స్థానికులు తెలిపారు. రాత్రి వేళలో కొందరు ఇసుక తరలిస్తుండడంతో వద్దని వారించినా వినలేదన్నారు. దీంతో సోమవారం రాత్రి గ్రామంలోని ఆటోలు, ఇతర వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నామన్నారు. ఇసుక తరలింపు ద్వారా భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపులు అరికట్టాలని కోరారు.

వివాహేతర సంబంధం మోజులో వేధిస్తున్నారు

- ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేసిన వివాహిత
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 32 వినతులు



భర్త వేధింపులపై ఫిర్యాదు చేసిన నిరీష

పుట్టపర్తి టౌన్: వివాహేతర సంబంధం మోజులో తనను వేధిస్తున్నారంటూ ఎస్పీ రత్న ఎదుట ఓడీసీ మండలం గౌరాపురం గ్రామానికి చెందిన వివాహిత నిరీష వాపోయింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి తన గోడు వెళ్లబోసుకుంది. వివరాలు.. గౌరాపురం అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న నిరీషకు ఆరేళ్ల క్రితం మహేంద్ర అనే వ్యక్తితో వివాహమైంది. అప్పటికే మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహేంద్ర అనంతరం మద్యానికి బానిసై తరచూ నిరీషను వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడు. దీనికి తోడు భర్త తరపు బంధువులు కూడా ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంటి వద్దకు చేరుకున్న వారు చంపుతానని బెదిరించి పోయారు. ఈ విషయంపై గతంలోనూ ఓడీ చెరువు పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేకూరకపోవడంతో నేరుగా ఎస్పీ దృష్టికే విషయాన్ని తీసుకొచ్చినట్లు బాధితురాలు తెలిపింది. తన భర్త, వారి కుటుంబీకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీ రత్నకు వినతి పత్రం అందజేసింది. దీనిపై స్పందించిన ఎస్పీ... సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కాగా, సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 32 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

బదిలీపై వెళ్తున్న పుట్టపర్తి డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావును ఎస్పీ రత్న సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై ఆయన రేపల్లెకు వెళుతున్న విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా పోలీస్టేషన్ డీఎస్పీగా శ్రీనివాస్‌రావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ

ముగిసిన ఎడ్ల బండ్ల పోటీలు



హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల బండ్ల పోటీ



మొదటి బహుమతి గెలుచుకున్న గాజులపల్లి శ్రీరాములు ఎద్దులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కొట్లపల్లి సమీపంలో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయ సమీపంలో రెండు రోజుల పాటు ఉత్కంఠగా జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బండి పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. పోటీలకు 76 ఎడ్ల బండ్లను యువ రైతులు తీసుకురాగా... పోటీల రౌండ్లు రెండు రోజుల పాటు కొనసాగాయి. వర్షం కురవడంతో ఆదివారం రాత్రి నిలిపివేశారు. దీంతో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. 8 రౌండ్ల పోటీలు నిర్వహించి తుది విజేతను ఎంపిక చేశారు. మొదటి విజేతగా పుట్టపర్తి మండలం గాజులపల్లి శ్రీరాములు ఎడ్ల బండి నిలువగా తులం బంగారు చైనును బహూకరించారు. రెండో విజేతగా పుట్టపర్తి మండలం బీడుపల్లికి చెందిన రైతు వినయ్ బండి నిలువగా వారికి 7.5 గ్రాముల బంగారు బహూకరించారు. మూడో విజేత గాజులపల్లి అంజీనాయక్‌కు అర తులం బంగారు బహూకరించారు. నాల్గో విజేత మల్లికామల ధనుంజయకు ఎల్‌ఈడీ టీవీని అందజేశారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం ఎడ్యుకేషన్: శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వర్క్ షాపు మూడో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేసేలా విద్యావిధానాన్ని రూపొందించాలన్నారు. నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన భావాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. చరిత్రను వక్రీకరణ చేస్తూ స్వాతంత్ర పోరాటంలో ఏ పాత్ర లేని ఆర్‌ఎస్ఎస్ నాయకులను పోరాట యోధులుగా పాఠ్యాంశాలలో చేరుస్తుండడం బాధాకరమన్నారు. దీనివల్ల రాష్ట్రాల సంస్కృతి, చరిత్ర కనుమరగవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నేటికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం పాలకుల వైఫల్యాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, ఎ. అశోక్, ఉపాధ్యక్షులు రామ్మోహన్, పరమేష్, వినోద్, నాయుడు, సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, సభ్యులు రజిత, అమూల్య పాల్గొన్నారు.

సహచరులే హంతకులు!

- మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి కేసులో వీడిన మిస్టరీ
- ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

రాయదుర్గం: ఈ నెల 1న చోటు చేసుకున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలను రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మారెమ్మగుడి వీధిలో నివాసముంటున్న కొల్లప్ప మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 29న బొమ్మనహాళ్ కేజీబీవీలో చదువుతున్న కుమార్తెను చూసి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన రెండు రోజులైన తిరిగి రాకపోవడంతో సోదరుడు లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గౌడ లే అవుట్ సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఈ నెల 1న కొల్లప్ప మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విభేదాలే హత్యకు కారణం..

రాయదుర్గానికి చెందిన దాస పవన్, దాస మధుసూదన్, కొల్లప్ప ముగ్గురూ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అంతేకాక వీరి మధ్య కొన్ని చెడు వ్యసనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి పవన్, మధుసూదన్ నుంచి కొల్లప్ప డబ్బు తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగం ఇప్పించకపోవడంతో విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న పవన్, మధుసూదన్ పక్కా ప్రణాళిక రూపొందించుకుని 29న రాత్రి కొల్లప్పను జగనన్న కాలనీలో నిర్మాణదశలో ఉండే ఓ పాడుబడ్డ ఇంటి వద్దకు రప్పించుకున్నారు. అనంతరం ముగ్గురూ కలసి మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వారి మధ్య మాటమాట పెరగడంతో చేతికి అందిన రాయితో కొల్లప్ప తలపై దాడి చేసి, హతమార్చి అక్కడి నుంచి ఉడాయించారు. రెండు రోజుల తర్వాత ఈ నెల 1న కొల్లప్ప మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో నిందితులను సోమవారం సాయంత్రం పల్లేపల్లి గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులను మంగళవారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ జయనాయక్, ఎస్ఐ బుల్లెట్ వలి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

జాతీయ రహదారిపై దారి దోపిడీ

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని దుండుగులు లారీ ఆపి వ్యాపారి, డ్రైవర్ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించారు. సీఐ రాఘవన్ తెలిపిన మేరకు... మదనపల్లి ప్రాంతానికి చెందిన వ్యాపారి జయరామిరెడ్డి కర్ణాటకలోని వడ్డుపల్లి నుంచి టమాట లోడును హైదరాబాద్ మార్కెట్‌కు తరలించి విక్రయించగా వచ్చిన రూ.5 లక్షలతో లారీ డ్రైవర్‌తో కలసి తిరుగు ప్రయాణమయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలోకి చేరుకోగానే కారులో వెంబడిస్తూ వచ్చిన దుండగులు అడ్డుకున్నారు. వ్యాపారి వద్ద ఉన్న రూ. 5 లక్షలు, లారీ డ్రైవర్ నియాజ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ. 7 వేల నగదు లాక్కొని ఉడాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఈ పాపం ఎవరిది?

- అపస్మారక స్థితిలో ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు
- సమాచారం అందుకుని అక్కడే వదిలేసి వెళ్లిన పోలీసులు
- తెల్లారేలోపు మృతి చెందిన బాధితురాలు



రొళ్ల: మండలంలో దారుణం చోటు చేసుకుంది. రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయం ఎదురుగా ఉన్న కర్ణాటక రాష్ట్రం హొసకెరకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఆదివారం మధ్యాహ్నం అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళ సోమవారం తెల్లవారేలోపు మృతి చెందింది. వివరాలు... ఆదివారం మధ్యాహ్నం హొసకెరకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన అనారోగ్యంతో పూర్తిగా నీరసించిపోయిన గుర్తు తెలియని మహిళ (33)ను స్థానికులు గుర్తించారు. ఆమె ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. మాట్లాడలేక కేవలం సైగలు మాత్రమే చేయడంతో అర్థం కాక సమాచారం అందించడంతో ఏఎస్ఐ బాలాజీ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో కర్ణాటకలోని మిడిగేశి హోబళి గొల్లహట్టిహవేరి గ్రామానికి చెందిన మహిళగా నిర్ధారించారు. దీంతో విషయాన్ని కర్ణాటక ప్రాంత పోలీసులకు తెలిపి ఆమెను కనీసం ఆస్పత్రికి కూడా చేర్చకుండా పోలీసులు నిర్లక్ష్యంగా అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. అప్పటికే పూర్తిగా నీరసించిపోయిన ఆమె సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అనాథ శవంగా గుర్తిస్తూ కేసు నమోదు చేసి, స్థానికుల సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించారు.

సెల్ఫీ తీసుకుని.. స్టేటస్‌లో పెట్టి!

- యువకుడి ఆత్మహత్య



ఉరి వేసుకునే సమయంలో వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన రాజారెడ్డి సెల్ఫీ

రాప్తాడు రూరల్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ఫీ తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన అంశం సంచలనం రేకెత్తించింది. వివరాలు... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన డి.రాజారెడ్డి (38) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్యతో పాటు పది, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు చవిచూసిన రాజారెడ్డి కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామ సమీపంలోని ఓ తోటలో చెట్టుకు చున్నీ కట్టి మెడకు తగిలించుకుని తన మొబైల్‌లో సెల్ఫీ తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. అనంతరం మెడకు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన రాజారెడ్డి స్నేహితులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు ఏకమై చుట్టుపక్కల ప్రాంతాలను గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సమాచారం ఇవ్వడంతో జీపీఎస్ ఆధారంగా రాజారెడ్డి మొబైల్ నంబర్ ఏ ప్రాంతంలో ఉన్నదో ఇటుకలపల్లి పోలీసులు పసిగట్టి తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకునే లోపు ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజారెడ్డి కనిపించాడు. వెంటనే ఆయనను కిందకు దించి సర్వజనాస్పత్రికి తీసుకెళితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జెడ్పీ ఎదుట కార్మికుల ధర్నా



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అనంతపురం సిటీ: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సోమవారం ధర్నా నిర్వహించారు. ఏడు నెలలుగా తమకు వేతనాలతో పాటు పీఎఫ్ మొత్తం చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే అంశానికి సంబంధించి గత నెల 29 నుంచి తాము సమ్మె చేస్తున్నా కలెక్టర్ గానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కానీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే తాము ఎలా బతకాలంటూ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు అక్కడకు చేరుకుని కార్మికులకు మద్దతు తెలిపారు.అనంతరం కార్మికులు, కార్మిక సంఘం నాయకులు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఓబులు, నాగమణి, ఎర్రస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో ఘర్షణ వాతావరణం



తాడిపత్రి పోలీసు స్టేషన్ ఎదుట నిలిపిన ఎద్దుల బండ్లు



పెన్నానదిలో ఘర్షణ పడుతున్న వారికి సర్దిచెబుతున్న సీఐ శివగంగాధరరెడ్డి


- ఇసుక తరలింపులను అడ్డుకున్న రజకులు
- బతుకుదెరువుపై దెబ్బతీస్తున్నారంటూ ఎద్దుల బండి నిర్వాహకుల నిరసన
- ఇరువర్గాల మధ్య ఘర్షణ

తాడిపత్రి రూరల్: స్థానిక పెన్నానదిలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎద్దుల బండ్లపై ఇసుక తరలింపులను రజకులు అడ్డుకున్నారు. దీంతో తమ పొట్ట కొడుతున్నారంటూ ఎద్దుల బండి నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాట చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని ఘర్షణను అడ్డుకున్నారు. అనంతరం విడివిడిగా స్టేషన్‌కు రప్పించుకుని మాట్లాడారు. రజకులు మాట్లాడుతూ.. కుల వృత్తిపై ఆధారపడిన తాము వందలాది మంది కొన్ని దశాబ్దాలుగా పెన్నానదిలో దుస్తులు ఉతుకుతున్నామన్నారు. ఉతికిన దుస్తులను ఆరవేసే ప్రాంతం మీదుగా ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో సమస్య ఉత్పన్నమై పలు మార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దక్కక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇటీవల ఇసుక తరలింపులు ఎక్కువ కావడంతో అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఎద్దుల బండ్లతో నిరసన

ఇసుక తరలింపులను రజకులు అడ్డుకుని తమకు బతుకు తెరువు లేకుండా చేస్తున్నారంటూ అప్‌గ్రేడ్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట వందకు పైగా ఎద్దుల బండ్లను నిలిపి యజమానులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆందోళనకారులతో సీఐ చర్చించారు. ఇసుక తరలింపును సజావుగా జరగడానికి రజకులను హెచ్చరించాలని కోరారు. ఇరువురి వాదనలు విన్న సీఐ ఎటు తేల్చుకోలేక శాంతి భద్రతలకు భంగం కలగకుండా శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించి, అక్కడి నుంచి పంపించేశారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ఇరు వర్గాలు సిద్ధమయ్యాయి. అయితే వారిద్దరూ స్థానికంగా తాము లేమని, మంగళవారం వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.

వాహనం ఢీ - వృద్ధుడి మృతి



ఓబుళప్ప (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సీకేపల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన ఓబుళప్ప(75) స్థానిక 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న రైస్ మిల్లులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. కాగా, వాహనం ఢీకొన్న వెంటనే ఓబుళప్ప ఎగిరి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చీకటి పడినా ఇంటి పెద్ద రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం ఉదయం మరోసారి జాతీయ రహదారి పక్కన గాలిస్తుండగా ముళ్లపొదల్లో ఓబుళప్ప మృతదేహం లభ్యమైంది. ఘటనపై సీకేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.